ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : సద్గురు శ్రీ నాన్నగారు

సంపుటి : 10 సంచిక : 14 పుష్పం : 29-30 05-04-2005

రమణ భాస్కర
ఆధ్యాత్మిక పక్ష పత్రిక
పేజీలు : 16
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రు॥100/-
విడి ప్రతి : రు॥ 8/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

22-01-05
తాడినాడ .................. 1

19-02-05
చించినాడ ................ 9

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, ☎ 08814 - 228858

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 22-01-05, తాడినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈ ప్రపంచంలోనికి రాకముందు మనం ఎక్కడ ఉన్నాము, ఇప్పుడు ఈ ప్రపంచంలోనికి వచ్చాము, ఈ శరీరం విడిచిపెట్టాక ఎక్కడికి వెళ్ళిపోతాము, ఈ రాక ఎక్కడ నుండి, ఈ పోక ఎక్కడికి? ఈ లోకం లోనికి మనం ఎందుకు వచ్చినట్లు, ఏమి సాధించినట్లు ఇటువంటి ప్రశ్నలు మనలో వస్తూ ఉంటాయి. ఎప్పుడయినా మన ఇంట్లోవారికి మనకు అభిప్రాయభేదాలు వచ్చినప్పుడు వారికి మనకు సంబంధం ఏమిటి? ఈ సమాజానికి మనకు సంబంధం ఏమిటి అనిపిస్తూ ఉంటుంది. మనం ఏదిగా ఉన్నామో ఆస్థితికి చేరుకొనేవరకు, బ్రహ్మానందంలో మనం ఐక్యమయ్యేవరకు ఇటువంటి ఘర్షణలు, సందేహాలు వస్తూనేఉంటాయి. వీటి అన్నింటికి పరిష్కారం ఏమిటి అంటే మన హృదయంలో ఉన్న భగవంతుడిలో మనం ఐక్యమవ్వాలి. భగవదనుభవం పొందేవరకు ఈ బాధలు, ప్రశ్నలు, సందేహాలు తప్పవు. భగవంతుడు సర్వసాక్షి, మూడు అవస్థలకు ఆయన సాక్షిగా ఉన్నాడు. నేను చెప్పే ప్రతి మాటను ఇక్కడ టేప్ ఎలా రికార్డు చేస్తోందో అలాగ మనం జాగ్రదవస్థలో ఈశరీరంతో చేసిన పనులను, మనస్సులో వచ్చే తలంపులను అన్నింటినీ భగవంతుడు రికార్డు చేసి ఉంచుతాడు, ఏదో రోజున, ఏదో జన్మలో మనం వాటికి సమాధానం చెప్పవలసిందే. గాఢ నిద్రలో మనకు ఏ గొడవలేదు, శరీరం గొడవ లేదు, మనస్సు గొడవ లేదు, లోకం గొడవ లేదు, కులమతాల గొడవ లేదు, లాభ నష్టాల గొడవ లేదు, ఇవి ఏమీ లేకుండా నువ్వు అక్కడ ఉన్నావా లేదా అంటే నువ్వు ఉన్నావు. గాఢనిద్రలో నీకు

తెలియకుండా దేహంలో నుండి, మనస్సులో నుండి, లోకంలో నుండి అన్నింటిలో నుండి విడిపోతున్నావు. జాగ్రదవస్థలో సాధనచేసి ఆ స్థితిని పొందు, అప్పడు నీకు అమృతానుభవం కలుగుతుంది. ఇది నేను కాదు, ఇది నేను కాదు అని అనుకొంటూ జాగ్రదవస్థలో వీటినన్నింటి నుండి సెపరేట్ అయితే నీకు మోక్షం వస్తుంది, మృత్యువును జయించి బయటకు వస్తావు. నువ్వు వీటి అన్నింటిని తప్పించుకొని ముందుకు వెళ్ళాలంటే యజ్ఞ దాన తపస్సులను విడిచిపెట్టవద్దు అని భగవంతుడు చెపు తున్నాడు. మనం సత్కర్మ చేస్తున్నాము అంటే కర్మరూపంలో భగవంతుడిని ఆరాధిస్తున్నాము. ఇది భౌతికం, ఇది ఆధ్యాత్మికం అని మనం విడదీసుకొంటాము కాని లోతులకు వెళ్ళి చూస్తే భౌతికానికి, ఆధ్యాత్మికానికి తేడా లేదు. మనం పనిని చక్కగా చేయటం, ఫలకాంక్ష లేకుండా చేయటం కూడా యోగంతో సమానము. ఆంజనేయస్వామిని మనం ఆరాధిస్తున్నాము, ఆంజనేయస్వామికి సొంతపని అంటూ ఏమీలేదు, ఆయన ఫలకాంక్ష లేకుండా పనిచేసి దేవుడు అయ్యాడు. ఇప్పడు మనకు ఒక పూజలేదు, సాధన లేదు, ఎడ్వర్‌టైజ్‌మెంట్ వలన దేవుడు అయిపోదామని మన ప్రయత్నం, ఇవన్నీ కలియుగంలో ఉన్న దోషాలు. సాధన చేసి భగవదనుభవం పొందుదామని అనుకొంటే ఫరవాలేదు ఏదో ఎడ్వర్‌టైజ్‌మెంటు చేసుకొని దేవుడు అయిపోవాలి అనుకొంటే అది ఎలా సాధ్యం. మనం భగవంతుడిని తప్పించి దేనిని పొందినా అది స్వప్నంతో సమానము.

మనం రాగద్వేషాలు అనే జైలులో ఉన్నాము. రాగం అంటే ఇష్టం, ద్వేషం అంటే అయిష్టం. ఎవరికైనా ఏదైనా నష్టం వస్తే మనకు దుఃఖం రాదు. మన ఇంట్లో మనకు ఏదైనా నష్టం వస్తే మనకు దుఃఖం వస్తుంది, అది రాగం. మనకు ఏదైనా దుఃఖం వస్తూ ఉంటే దానికి రెండే కారణాలు లోపల రాగమయినా ఉండాలి, ద్వేషమయినా ఉండాలి. రాగద్వేషములు మనస్సును బాహ్యముఖానికి తీసుకొనివస్తాయి. ఈ శరీరం చనిపోయి మనం మరొకచోట పుట్టినా జైలు మారుతుంది అంతే, ఎందుచేతనంటే మనం రాగద్వేషముల నుండి విడుదల పొందలేదు. రాగద్వేషరహితుడు మాత్రమే ఈ జైలు నుండి విడుదల పొందుతాడు. ఒకసారి విశాఖపట్నం జిల్లా జడ్జీగారు మమ్మల్ని జైలులో ప్రవచనం పెట్టమని అడిగారు. ఏదో గుణాల వలన అలా పాడయిపోయారు, వారికి మంచి చెపితే వారు కూడా బాగుపడతారు అని అడిగారు. ఆయనకు ఒక కథ చెప్పాను. పూర్వం ఒక గురువుగారు ఉండేవారు. ఆయన చిన్న చిన్న దొంగతనాలు చేసేవారు, అదీ పోలీసువారికి దొరికిపోయేలాగ చేసేవారు. పోలీసువారు ఆయనను పట్టుకొని జైలులో పెట్టేవారు. ఇలా చిల్లర దొంగతనాలు

చేసి ఏదోరకంగా జైలులోనికి వెళ్ళి వారికి మంచి బోధించాలని అనుకొనేవారు. దొంగతనం చేయకపోతే జైలులో పెట్టరు కదా అందుచేత చిల్లర దొంగ తనాలు చేసేవారు. అటువంటి మహాత్ములు కూడా ఉన్నారు. కొద్దికాలం జైలులో ఉండి బోధించటం మరల బయటకు వచ్చి కొంతకాలం ఉన్నతరువాత దొంగతనం చేసి మరల జైలుకు వెళ్ళటం ఆగురువుగారు భక్తులకు అర్థం అవ్వలేదు. ఏమిటి మన గురువుగారు ఇంత మంచి ఆయన ఇలా దొంగతనాలు చేయటం ఏమిటి అనుకొనేవారు. వారికి పబ్లిసిటీ అక్కరలేదు, లోకానికి సంబంధించిన గౌరవాలు అక్కరలేదు, ఆదొంగలు కూడా బాగుపడాలి అది గురువుగారి ఉద్దేశం. ఆగురువుగారు ఎందుకు దొంగతనం చేస్తున్నారో లోపల ఉన్న ఈశ్వరుడు చూస్తున్నాడు, దేహభావనలో నుండి, మనోభావనలోనుండి విడుదల పొందటమే మోక్షం.

పాపాలలో కెల్లా మహాపాపం ఏమిటి అంటే మనం ఆత్మ అయినప్పటికీ, చావు పుట్టుకలు లేని వస్తువే మనం అయినప్పటికీ మనం దానిని మరిచిపోయి, దాని ఎరుక వదిలేసి కేవలము ఈశరీరమే ఆత్మ అనుకొని, ఈశరీరానికి పరిమితమై ఉండిపోవటమే పాపాలలో కెల్లా మహాపాపం. శవబుద్ధి కంటే మించిన పాపం ఇంకోటి ఏదీ లేదు. మనం దోషాలు చేసాము కాబట్టే మనం శివ స్వరూపం అయినప్పటికీ మనకు శవబుద్ధి కలుగుతోంది. ఎవరికి ఏమీ పెట్టకుండా నువ్వు సంపాదించినది అంతాకూడా నువ్వే తినేస్తూ ఉంటే నువ్వు తినేది అన్నంకాదు, పాపం అని పరమాత్మ చెప్పాడు. భగవంతుడు సూక్ష్మాతి సూక్ష్మం. నీ బుద్ధి అంతసూక్ష్మం అయితేనే ఆయన నీకు వ్యక్తమవుతాడు. సత్కర్మ చేయటం వలన నీ బుద్ధి సూక్ష్మాతి సూక్ష్మం అవుతుంది. మనం నిజంకానిదానిని నిజం అనుకొంటాము అనుకోండి, చెడ్డను మంచి అనుకొంటాము అనుకోండి చివరకు అది దుఃఖాన్ని తీసుకొని వస్తుంది, అందులోనుండి బయటకు రావటానికి మరల సాధన చెయ్యాలి. అక్షరమణమాలలో భగవాన్ అంటారు ఓ అరుణాచలేశ్వరుడా! లోకం మీద ఉన్న మోహం పోగొట్టుకోవటానికి నీ మోహంలో పడ్డాను. అయితే ఇప్పుడు నువ్వు వేరు, నేను వేరు అనే బుద్ధి ఉంది, ఆ వేరుబుద్ధి పోతేగాని నీలో ఐక్యం కాలేను. రెండు ఉంటే మరల మోహం ప్రారంభమవుతుంది, సంసారం ప్రారంభమవుతుంది, కోరిక ప్రారంభమవుతుంది, జగడం ప్రారంభమవుతుంది. ఆ వేరుబుద్ధిని నా తెలివితేటల వలన పోగొట్టుకోలేను. నీ దయను చూపించి ఆ వేరుబుద్ధిని పోగొట్టి నీలో నన్ను ఐక్యం చేసుకోవాలి అన్నారు. కీర్తికాంక్షను పోగొట్టుకోవటం చాలా కష్టం. కీర్తి కాంక్ష ఉన్నప్పుడు ఆధ్యాత్మికఅభివృద్ధి ఆగిపోతుంది, చీకటిలో పడిపోతూ ఉంటాము. తినటానికి చాలా బాగుంది అని ఒక మామిడిపండును మనం అక్కడ పెట్టుకొన్నాము అనుకోండి, కాకులు

వచ్చి దానిని పాడుచేస్తాయి అనుకోండి, మనం దానిని తినము, వదిలేస్తాము. అలాగే జీవుడు ఎంత మంచివాడు అయినప్పటికీ కీర్తికాంక్ష పట్టుకొంటే వాడిని దేవుడు వదిలేస్తాడు అని రామకృష్ణుడు చెప్పాడు. అందుచేత నీవు ఏదైనా మంచి పనిచేసినా కీర్తిని దృష్టిలో పెట్టుకొని చేయవద్దు. గొప్పలు దృష్టిలో పెట్టుకొని చెయ్యవద్దు, గొప్పలకెళితే తిప్పలు వస్తాయి, నీవు ఏ పని చేసినా భగవంతుని అనుగ్రహం పొందటానికి చెయ్యి. మనందరకు గర్వం ఉంటుంది, ఆ గర్వం బయటవారికి కనబడకుండా మేకప్ చేసుకుంటూ ఉంటాము. డబ్బు ఉన్నవారికి డబ్బు ఉందని గర్వం, అందంగా ఉన్న వారికి మేము అందంగా ఉన్నాము అని గర్వం. ఇవన్నీ మనకు భగవంతుడు ఇచ్చాడు అని మర్చిపోతున్నాము. భగవంతుడు నీకు ఇచ్చిన బహుమానాలను చూసి గర్వపడుతున్నావు, అది నీది అనుకొంటున్నావు కాని నీది అంటూ ఈ ప్రపంచంలో ఏమీ లేదు. నీకు గర్వం ఉంది అనుకో, అది నీ చుట్టూ గోడ కట్టేస్తుంది. నిన్ను జైలులో పడేస్తుంది. అందుచేత గర్వం తగ్గించుకోవాలంటే నీకు ధనం ఉంది అనుకో దానిని మీ ఇంటికే పరిమితం చెయ్యకు, లోకానికి విస్తరింపచెయ్యి. మీకు చదువు ఉంది అనుకో, ధనం ఉంది అనుకో దానిని కొంచెం కొంచెం పంచి పెట్టుకొంటూ రండి, మీలో ఉన్న మంచిని లోకానికి విస్తరింప చేయటం వలన, పంచుకొంటూ రావటం వలన బుడగ పగలినట్లు గోడలు పగిలిపోయి జైలులో నుండి బయటకు వచ్చేస్తాము. మన తెలివితేటలతో భగవంతుడిని తెలుసుకోలేము. ఆయన మన వాక్కుకు అందడు, ఇంద్రియాలకు అందడు, మనస్సుకు అందడు, బుద్ధికి అందడు. ఇవన్నీ అణిగిపోతే ఆయన అంతట ఆయన మనకు తెలియబడతాడు. పూర్తిగా నువ్వు అణగాలి. మనం ఎగిరెగిరి పడుతూ ఉంటే ఎక్కడ అణుగుతాం. మనకు ఏదైనా ఉండి గర్వం తెచ్చుకొంటే అది వేరే విషయం కానీ మనకు ఏమీ లేకుండానే గర్వం ఉంది. మనం సత్వగుణాన్ని ప్రాక్టీసు చేస్తూ ఉంటే గర్వం తగ్గిపోతుంది. గర్వం వలన చాలా ప్రమాదం, దేవుడి గొడవ వదిలివేయండి, గర్వం వలన భౌతికంగా కూడా చాలా నష్టపోతాము.

మీకు ఎవరి మీద అయినా అసూయ వచ్చింది అనుకోండి, వెంటనే మనస్సులో మీకు అశాంతి వస్తుంది, లోపల ఉద్రేకం వస్తుంది, శరీరానికి రోగం వస్తుంది. అందుచేత అసూయ, గర్వం, భయం, కోపం వీటిలోనుండి విడుదల పొందు. కాలము, దూరము, దేహము, లోకము ఇవన్నీ కూడా మనస్సులోనే ఉన్నాయి. ఈ మనస్సు అనే గడపను దాటటానికే పూజ, జపం, ధ్యానం ఇవన్నీ ఏర్పాటు చేసారు. మీ ఇంట్లో బంగారం ఉండటం మంచిదే. కాని మీ ఇంట్లో బంగారం ఉండటం వలన మీకు మోక్షం రాదు, మీ మనస్సు బంగారం

అయితే మోక్షం వస్తుంది. మన మనస్సుకు ఏదైనా బాధ కలిగినప్పుడు మనం బాధ లేకుండా ఉండగలుగుతున్నాము అనుకోండి, శరీరానికేదైనా రోగం వస్తే ఆ రోగాన్ని తట్టుకొంటున్నాము అనుకోండి అది కూడా తపస్సే, దాని వలన కూడా భగవంతుని దయకు పాత్రులవుతాము. మనం ఏదైనా సహించటం, భరించటం నేర్చుకోవాలి. అన్నవాడు మహాత్ముడు అవ్వడు, పడ్డవాడు మహాత్ముడు అవుతాడు. ఒక దేవతారూపం మీద మనస్సును పెట్టి ధ్యానం చేస్తున్నాము అనుకోండి అప్పుడు మనకు చెడుతలంపులు, అక్కరలేని తలంపులు రావు. అప్పుడు గాలి లేనిచోట దీపం ఎలా ఉంటుందో అలాగ మన మనస్సు నిదానంగా, నిశ్చలంగా ఉంటుంది. అప్పుడు మనస్సుకు సూక్ష్మత వస్తుంది. అంతేకాదు దానికి అంతర్‌దృష్టి వస్తుంది. మనస్సుకు అంతర్‌దృష్టి వచ్చాక అప్పుడు ఆత్మజ్ఞానం కలుగుతుంది.

మాయ అంతా గుణాల రూపంలో ఉంది, వాటి నుండే తలంపులు వస్తాయి, ఆ తలంపులే నిన్ను బంధిస్తాయి. ఆగుణాల నుండి విడుదల పొందటానికే పూజ, జపం, ధ్యానం, వైరాగ్యం, వివేకం, విచారణ. మనకు జ్ఞానం రాకపోవటానికి కారణం అసలు మనకు వైరాగ్యం లేదు అని కాదు మనకు ఉండవలసినంత వైరాగ్యం లేదు. మనకు జ్ఞానం కలిగింది అనుకోండి ఈ గుణాలు అనే జైలు నుండి బయటపడతాము. ఒకే రూపం మీద, ఒకే నామం మీద నీ మనస్సు అలా నిలబడి ఉంటే నీకు ధ్యానస్థితి కలుగుతుంది. ధ్యానస్థితిలో ఎక్కువగా ఉండటం వలన ఈ గుణాల నుండి, వికారముల నుండి నువ్వు విడుదల పొందుతావు. మనం అవసరం అయినప్పుడు మాట్లాడుతూ ఉండాలి, అవసరం లేనప్పుడు మాటలు తగ్గించుకొంటూ ఉండాలి. మౌనం, ఏకాంతం ఇవి రెండూ కూడా నువ్వు గుణరహితస్థితిని పొందటానికి సహకరిస్తాయి. రోజూ కొద్దిసేపు మనం ఇంట్లో ఏకాంతంగా ఉండాలి. ఏకాంతంగా ఉన్నప్పుడు మన మనస్సులో ఏముందో మనకు తెలుస్తూ ఉంటుంది. ఎందులోనుండి మనం విడుదల పొందాలి, ఏ కారణం వలన మనకు దుఃఖం వస్తోంది, ఏ తలంపులు మనలను బంధిస్తున్నాయి అని మనలను మనం విచారణ చేసుకోవటానికి ఏకాంతవాసం ఉపయోగపడుతుంది. చేస్తే ఏకాంతవాసం లేకపోతే సహవాసం. సహవాసం అంటే నీ హృదయంలో ఉన్న సద్వస్తువుతో కలిసి ఉండటం నిజమైన సహవాసం. దానితో కలిసి ఉండే అలవాటు నీకు లేదు అనుకో, ఆ నేర్పు నీకు లేదు అనుకో బయటఉన్న సత్పురుషులతో సహవాసం చెయ్యి. సత్పురుషులతో సహవాసం లోపలఉన్న సద్వస్తువును తెలుసుకోవటానికి నీకు సహకరిస్తుంది. నేను ఉన్నాను, దేవుడు ఉన్నాడు అని ఇప్పుడు మనం అనుకొంటున్నాము. అయితే మీరు రెండుగా ఉన్నారా? ఈ మనస్సే నేను అనుకోవటం వలన దానితో తెలుసుకొనేది

ఏదో ఉంది అనుకొంటున్నావు. ఈ దేహం నేను, ఈ మనస్సు నేను, ఈ ఇంద్రియాలు నేను అని నీవు అనుకొంటున్నావు. ఇలా అనుకోవటం వలననే బంధింపబడుతున్నావు. ఇలా అనుకొనేది ఏదీ నీవు కాదు. జ్ఞానం అంటే తెలుసుకోవటం కాదు, ఉండటమే. లోపల ఉన్న వస్తువు ఎలా ఉందో అలా ఉండ గలగాలి. నేను అలా ఉన్నాను, నేను ఇలా ఉన్నాను అని, నీవు అనుకోవద్దు, ఇలా అనుకొనేది నీ మనస్సే, దీనివలన రజోగుణం పెరుగుతుంది. అందువలన ఏమీ అనుకోవద్దు, ఊరక ఉండు. జ్ఞానం అంటే మనస్సుతో గ్రహించేది కాదు, పుస్తకాలు చదవటం వలన వచ్చేది కాదు. గురువు చెపుతూ ఉంటే మీరు వినాలి. బజారులో పుస్తకాలు అమ్ముతున్నారు, వాటిని కొనుక్కొని చదువుకొంటే జ్ఞానం వచ్చేస్తుందా? పుస్తకం జడం, గురువు అంటే చైతన్యం. ఆ చైతన్యం వివరిస్తూ ఉంటే నీ మనస్సుకు లోచూపు కలుగుతుంది. హృదయ గుహలోనికి ప్రవేశిస్తుంది. హృదయంలో ఉన్న వస్తువును చేరటానికి కేవలం పుస్తకం సహాయం చేయలేదు, ఆ శాస్త్రాన్ని గురువు వివరిస్తూ ఉంటే నీ మనస్సు అక్కడకు చేరుకొంటుంది. అందుచేత గురువు సహాయం అవసరం. జడవస్తువు మనలను లోపలకు తీసుకొని వెళ్ళలేదు అందుచేత గురువు ముఖతః వినాలి. మనం బాగుపడటానికి ఒకమాట చాలు, అది మన గుండెకు పడితే.

అన్ని కాలాలలో అన్ని అవస్థలలో ఉండేదే సత్యం. ఒక కాలంలో ఉండి ఇంకో కాలంలో లేనిది సత్యం కాదు. ఇప్పడు మనం అందరం ఏమనుకొంటున్నాము. పుట్టకముందు మనం లేము అనుకొంటున్నాము, చనిపోయిన తరువాత ఉండము అని అనుకొంటున్నాము. కాని మనం పుట్టకముందు ఉన్నాము, ఇప్పడూ ఉన్నాము, చనిపోయిన తరువాత కూడా ఉంటాము. ఆ ఎరుక లేకపోవటం వలన ఉండము అనుకొంటున్నాము, వీటి అన్నింటికి దేహభావనే కారణం, దేహమే నేను అనుకోవటం వలన ఇదంతా వస్తోంది. అన్ని కాలాలలో, అంతటా నిండి ఉన్న వస్తువును తీసుకొనివచ్చి దేహానికి పరిమితం చేస్తూఉంటే అంతకు మించిన పాపం, దోషం ఏమి ఉంటుంది. దేహములోపల నేను ఉన్నాను, నాకు బయట ప్రపంచం ఉంది, ఎక్కడో దేవుడు ఉన్నాడు అంటే నీకు ఆత్మజ్ఞానం కలుగదు, ఈ మూడూ ముద్ద అవ్వాలి, అప్పడు ఆత్మజ్ఞానం. మీకు ఎన్ని మహిమలు ఉన్నా, సిద్ధులు ఉన్నా అవి అన్నీ స్వప్నంతో సమానము. ఒకాయనకు వాళ్ళబ్బాయి రేపు చనిపోతాడు అనగా స్వప్నం వచ్చింది అట. ఆ స్వప్నంలో ఆయన మనస్సు ఒక కొడుకును కల్పించింది. ఆ కొడుకు స్వప్నంలోనే వచ్చాడు మరల స్వప్నంలోనే చనిపోయాడు. ఆ మరుసటి రోజున జాగ్రదవస్థలో కొడుకు

చనిపోయాడు. అప్పడు ఆయన అన్నాడట స్వప్నంలో చనిపోయిన కొడుకు గురించి ఏడవాలో, వీడికోసం ఏడవాలో నాకు తెలియటం లేదు, బహుశా వాడి కోసం ఏడుపు రాదు ఎందుచేతనంటే అది అబద్ధం అని తెలిసిపోయింది. అలాగే ఇది కూడా అబద్ధం అని తెలిస్తే ఇంక వీడికోసం కూడా ఏడుపురాదు అని చెప్పారు. అంటే ఆయన స్వప్నంలో నుండి మేల్కొన్నాడు ఇంకా జాగ్రదవస్థలోనుండి అంటే అజ్ఞానంలోనుండి మేలుకోలేదు. స్వప్నంలో నుండి మేల్కొన్నాక ఆ స్వప్న కుమారుడు అసత్యం అని తెలిసిపోయింది కాబట్టి ఏడుపురాదు. వీడు చనిపోయినప్పడు ఇది సత్యం అనుకొన్నాడు కాబట్టి ఏడుపు వస్తోంది. ఇది కూడా అసత్యమే అని ఆయనకు అనుభవంలోనికి వస్తే ఇప్పడు కూడా ఇంక ఏడుపు రాదు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నిద్రపోయేవాడు మేల్కొంటాడు, మేల్కొన్నవాడు నిద్రపోతాడు నీకేల. చనిపోయినవాడు తిరిగిపుడతాడు, పుట్టినవాడు చనిపోతాడు నీకేల, ఇవన్నీ జీవ లక్షణాలు. లోపల ఉన్న వస్తువు నిద్రపోయేది కాదు, మేల్కొనేది కాదు, ఎప్పడూ ఎరుకలో ఉండేది. శరీరం చనిపోతుంది, శరీరం పుడుతుంది. ఆ శరీరం నీవు అనుకోవటం వలన నేను చనిపోతున్నాను, నేను పుడుతున్నాను అనుకొంటున్నావు, గోలగోల చేసేస్తున్నావు. నువ్వు చనిపోయేవాడవు కాదు, పుట్టేవాడవు కాదు, వీటితో నీకు సంబంధం లేదు అంటున్నారు భగవాన్. బాహ్యంగా చూడండి దత్తతకు వెళ్లినవారు దత్తత తీసుకొన్నవారు పెట్టే అవమానాలు, కష్టాలు భరిస్తే వారికి ఆస్తి దక్కుతుంది. భౌతికంగా ఆస్తి కోసం ఇన్ని కష్టాలు పడితేనేగాని వాడు ఆస్తికి వారసుడు అవ్వడు. అలాగే బ్రహ్మజ్ఞానం పొందటం కోసం మన ప్రారబ్ధం కొట్టే లెంపకాయలు అన్నీ భరించాలి, వాటిని భరిస్తే లోపలఉన్న ఆత్మజ్ఞానానికి మనం వారసుల మవుతాము.

పనిని ఓర్పుగా, నేర్పుగా చేయటం కూడా యోగంతో సమానము. సమాన బుద్ధిని కలిగి ఉండటం, సమత్వదృష్టిని కలిగి ఉండటం కూడా యోగంతో సమానము. ఇక్కడ అనేక శరీరాలు ఉన్నాయి, అనేక గుణాలు ఉన్నాయి. మనం చూస్తే ఎదుటివాడి శరీరాన్ని చూస్తాము, లేకపోతే వాడి గుణాన్ని చూస్తాము. శరీరం బాగుంటే వాడు బాగున్నాడు అంటాము, గుణం మంచిది అయితే వాడు మంచివాడు అంటాము. కాని భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే ఈ శరీరాలను దాటి, గుణాలను దాటి, అంతస్థులను దాటి, మంచి చెడులను దాటి, ద్వైతబుద్ధిని దాటి అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్న సద్వస్తువును ఎవడైతే చూస్తున్నాడో వాడు నిజమైన చూపు గలవాడు అని పరమాత్మ చెపుతున్నాడు.

ఎందుచేతనంటే వాడు హృదయంలో ఉన్న సత్యాన్ని చూస్తున్నాడు, సత్యం కానిదానిని వదిలేస్తున్నాడు ఇంక వాడికి వికారం ఎలా వస్తుంది, వికారం రానేరాదు. మనం మంచి తలంపుతో ఒక పని చేసాము అనుకోండి అది మన ఆరోగ్యానికి మంచిది, జ్ఞాన సముపార్జనకు సరేసరి అంతేకాదు సమాజం మీద కూడా దాని ప్రభావం ఉంటుంది. మనం మీటింగులకు వెళ్ళినప్పుడు జ్యోతి ప్రజ్వలన చేస్తూ ఉంటారు. పగలు జ్యోతి ప్రజ్వలన ఎందుకు అంటారు. చీకటి అజ్ఞానానికి గుర్తు, వెలుగు జ్ఞానానికి గుర్తు. జ్ఞానం యొక్క ప్రాముఖ్యత, శాంతి యొక్క ప్రాముఖ్యత, వెలుగు యొక్క ప్రాముఖ్యత తెలియటానికే, ఆ సంకేతం కోసమే జ్యోతి ప్రజ్వలన చేస్తారు.

మనం పనిచేసేటప్పుడు ఆ పనిమీద మనస్సు ఉండాలి కాని పని ద్వారా వచ్చే ఫలితం మీద మనస్సు ఉండకూడదు. ఫలితం మీద మన మనస్సు ఉంటే పని సక్రమంగా చేయలేము, కర్మ ఫలితానికి దూరమవుతాము, ఈశ్వరానుగ్రహానికి దూరమవుతాము. కర్మ చేసేటప్పుడు కర్మ మీదే మనస్సును పెట్టి చెయ్యి, అప్పుడు కర్మఫలం వస్తుంది, ఈశ్వరుని దయ కూడా వస్తుంది. మనకు లోపల వాసనలు సూక్ష్మంగా ఉంటాయి. మనకు తెలిసిన వాసనలే ఉన్నాయి, ఇంక ఏమీ లేవు అనుకోవద్దు. మనకు తెలియని వాసనలు కూడా హృదయంలో సూక్ష్మంగా ఉంటాయి. అవి ఎప్పుడో టైమువచ్చినప్పుడు బుర్రలోనికి వస్తాయి. హృదయంలో సూక్ష్మంగా ఉన్న వాసన శిరస్సులోనికి వస్తేనేగాని ఆవాసన ఉన్నట్లు నీకే తెలియదు. పరమేశ్వరుడు ఒకోసారి నీ హృదయాన్ని కెలికి, నీలో ఉన్న వాసనలను నీకు తెలియజేసి, వాటిని తొలగించుకోవటానికి నీకు శక్తిని ఇచ్చి, నీ చేత సాధన చేయించి, వాటిలోనుండి నిన్ను విడుదల చేస్తాడు, వాడే ఈశ్వరుడు, వాడే గురువు. ఇంక నువ్వు ఎక్కడ ఉన్నావు, అంతా ఈశ్వరుడే. మన దేహప్రారబ్ధం సరిగా లేకపోతే, కష్టాలు వస్తూ ఉంటే అప్పుడు దేవుడు లేడు అనుకొని, దేవుడిని విడిచి పెట్టకూడదు. ప్రారబ్ధం అనేది దేహానికి సంబంధించినది, అసలు వస్తువుకు ఏమీ లేదు, మనం అక్కడకు మేల్కోవాలి. నీకు లోపల కోరికలు, తలంపులు, వాసనలు ఉన్నాయి. వీటివలన ఈ ప్రపంచమే నిజం, ఈ దేహమే నిజం, విరోధమే నిజం, స్నేహమే నిజం ఇలా నీకు అనిపిస్తూ ఉంటుంది. ఇవన్నీ నిజం కావటం వలన నీకు నిజం కింద అనిపించటం లేదు, నీ వాసన వలన, కోరిక వలన, సంస్కారం వలన నీకు నిజం కింద అనిపిస్తున్నాయి. నిజం కానిది నిజంవలె కనిపించటానికి నీ కోరికే కారణం, నీ వాసనే కారణం, నీ తలంపే కారణం. లోపల వాసన ఉన్నంత సేపు మనస్సు యొక్క చాలప్యం ఆగదు,

బుద్ధికి సూక్ష్మత రాదు. మనం సత్కర్మ చేయకపోతే, భగవంతుడిని పూజించకపోతే, భగవంతుడిని ప్రేమించక పోతే, భగవంతుడు చెప్పినట్లు మనం వినకపోతే ఈ దేహము నేను, ఈ దేహము నాది అనే బుద్ధిలో నుండి విడుదల పొందలేము. ఈశ్వరుని స్మరించగా స్మరించగా, ధ్యానించగా ధ్యానించగా నీ బుద్ధి శుద్ధి అయినప్పుడు ఈ దేహము నేను, దేహము నాది అనే తలంపులలో నుండి బయటకు వస్తావు, అంతవరకు వీటిలోనుండి బయటకువచ్చే సమస్య లేదు, జన్మ జన్మలకు ఈ జైలులో ఉండ వలసిందే, దేహం మరణించినప్పుడు జైలు మారుస్తారు అంతే గాని బయటకు విడిచిపెట్టే అవకాశం లేదు. అందుచేత సాధన చేసి ఈ జైలులో నుండి విడుదల పొందాలి.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-02-05, చించినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈరోజు భీష్మఏకాదశి. భీష్ముడు మహాజ్ఞాని, ఆచార్యుడు, పితామహుడు. భీష్ముడిది స్వచ్ఛంద మరణం అంటే ఆయనకు ఇష్టమయితే మరణిస్తారు కాని ఆయనను ఎవరూ చంపలేరు. భారతయుద్ధంలో ఆయన పదిరోజులు యుద్ధం చేసాడు. ఆ రోజులలో యుద్ధం పగలే చేసేవారు, రాత్రి యుద్ధం చేసేవారు కాదు. భీష్ముడు మరణించకపోతే పాండవులు జయించలేరు. అందుచేత కృష్ణుడు పాండవులను పిలిచి ఈ రాత్రి మీరు తాతయ్య దగ్గరకు వెళ్ళి తాతయ్యా మీరు చనిపోవాలి, మేము మిమ్మల్ని చంపలేము, మీరు చనిపోకపోతే యుద్ధం ముగియదు, మీరు చనిపోయే విధానం మీరే చెప్పండి అని భీష్ముడిని అడగండి అని పాండవులను పంపాడు. రేపు ఫలానా రకంగా యుద్ధం చెయ్యండి, నేను పడిపోతాను అని భీష్ముడు చెప్పాడు, ఆ రకంగా పాండవులు యుద్ధం చేసారు, ఆయన పడిపోయాడు, అప్పటికి ఉత్తరాయణం రాలేదు, ఉత్తరాయణం వచ్చేవరకు ఆగి ఆరోజున ఆయన శరీరం విడిచిపెట్టాడు. నీరు కావాలంటే మీరు నది దగ్గరకు వెళ్ళండి, చలివేస్తూ ఉంటే వెళ్ళి నిప్ప దగ్గర కూర్చోండి, కాని జ్ఞానం కావాలంటే నిప్ప ఇవ్వదు. నది ఇవ్వలేదు, మీకు జ్ఞానం కావాలంటే మహాజ్ఞానిని ఆశ్రయించి, ఆయనను సేవించి బ్రహ్మజ్ఞానం పొందండి అని పెద్దలు చెపుతారు. మహాజ్ఞానికి సేవచేస్తే మీరు త్రిమూర్తుల అనుగ్రహానికి కూడా పాత్రులవుతారని ఒక గ్రంధంలో ఉంది. భీష్ముడు శరీరం విడిచిపెట్టే ముందు కృష్ణుడు పాండవులను పిలిచి ఆయన మహాత్ముడు, మహర్షి, మహాజ్ఞాని, తండ్రికి ఇచ్చిన మాటను పోషించుకోవటానికి అన్ని సుఖాలు విడిచి పెట్టాడు, మిమ్మల్ని పెంచి పెద్దచేసాడు, విద్య చెప్పించాడు, ఆయనకు తెలిసినన్ని మంచి

విషయాలు తెలిసినవాడు ఇంకొకడు కనబడడు, ఆయన ఇంక ఎంతోకాలం శరీరం ధరించి ఉండరు, ఆయనను ఉపయోగించుకోవాలి అని చెప్పాడు. కృష్ణుడి సలహా మీద ఆయన పాండవులకు అనేక ధర్మాలు బోధించాడు. కృష్ణుడిని దగ్గర పెట్టుకొని పాండవులకు విష్ణు సహస్రనామాలు బోధించాడు, భగవంతుడు గుణాలను నామాలతో స్తోత్రం చేయటం, చాలా మంది విష్ణుసహస్రనామాలకు ఇవ్వవలసిన ప్రాముఖ్యత ఇవ్వటంలేదు, ఏదో నామాలు కదా అనుకొంటున్నారు, నాలుగు వేదాల సారం విష్ణుసహస్రనామాలు. దాంట్లో వక్త భీష్ముడు, శ్రోత ధర్మరాజు. భగవంతుడి సమక్షంలో భగవంతుడి గుణాలను గానం చేసాడు, అదే విష్ణు సహస్రనామాలు. మనం షాపుకు వెళ్ళి బట్టలు ఎందుకు కొనుక్కొంటున్నాము ఎక్కడో పడేయటానికి కాదు, కట్టుకోవటానికి, అలాగే మనం మాటలు ఎందుకు వినాలి అంటే వాటిని విడిచిపెట్టటానికి కాదు, వాటిని మననం చేసి, ధ్యానం చేసి, వాటిలో ఉన్న సారాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి శ్రవణం చేయాలి.

మనం ఎవరో ముందు మనకు తెలియాలి. మనలను మనం తెలుసుకొంటేనే భగవంతుడు అంటే ఏమిటో మనకు అవగాహన కలుగుతుంది, భగవంతుడు అంటే ఇట్టివాడు, ఆయన శక్తి ఇట్టిది అని మనకు తెలుస్తుంది. మనలను మనం తెలుసుకోవటం ఎందుకు అంటే భగవంతుడిని తెలుసుకోవటానికే, ఆవిషయం మీకు అర్ధమవ్వాలి. మనలను మనం తెలుసుకోకుండా భగవంతుడిని తెలుసుకోవటానికి ప్రయత్నం చేసి ఎక్కడో బాహ్యంగా చూస్తాము అనుకోండి అది స్వప్నంతో సమానము. మన మనస్సు ఎంత నిజమో ఆ కనిపించే భగవంతుడు కూడా అంతే నిజం. మోక్షానికి సంబంధించిన తలంపు తప్పించి ఇతర తలంపులు ఎవడికయితే రావటం లేదో వాడు ముముక్షువు. మనం శాంతిగా లేము అనుకోండి అంటే లోపల అశాంతి ఉందని అర్థం. శాంతి ఎక్కడ దొరుకుతుంది? నది దగ్గరకు వెళితే నీరు దొరుకుతుంది, భగవంతుడిని ఆశ్రయిస్తే మనకు శాంతి దొరుకుతుంది ఎందుచేతనంటే ఆయన శాంతి స్వరూపుడు. మనం పరుషవాక్యాలు మాట్లాడకూడదు, దైనందినజీవితంలో మన ప్రవర్తన నాగరికంగా ఉండాలి, సభ్యతగా ఉండాలి. మనం శాంతచిత్తం విడిచిపెట్ట కూడదు. మనచేత పాపం చేయించేవి, మనచేత చెడ్డ చేయించేవి రెండే రెండు. అవి కోపం, కోరిక. కోరికలు తీర్చుకొనే కొలది పెరుగుతాయి. కోరిక నెరవేరితే గర్వం వస్తుంది, కోరిక నెరవేరకపోతే కోపం వస్తుంది. ఈ కోరిక, కోపం రెండూ పాపాన్ని తీసుకొని వస్తాయి.

బంగారంలాంటి మనస్సు సంపాదించు. ఇష్టాలకు, అయిష్టాలకు, కామక్రోధాలకు

అతీతంగా ఎవడైతే జీవించగలుగుతున్నాడో వాడికి బంగారంలాంటి మనస్సు వస్తుంది. ఎవడి మనస్సు అయితే బంగారం అయ్యిందో వాడు మోక్షానికి అర్హత పొందుతాడు. ఓ అరుణాచలేశ్వరుడా! నువ్వు వేరు, నేను వేరు అని వేరుబుద్ధి నాకు ఉంది. నావంక చూడు, నా గురించి ఆలోచించు, నన్ను తలపెట్టుకో, నీ మనస్సులోనికి నన్ను తీసుకో. ఏదో పద్ధతి ద్వారా లేకపోతే అన్ని పద్ధతులు ఉపయోగించి నాలో ఉన్న భేదబుద్ధిని తొలగించు. నువ్వు ఉన్నావు, నేనూ ఉన్నాను అని అనుకొంటున్నాను, పైగా వేరు అనుకొంటున్నాను. నేను లేను, నువ్వే ఉన్నావు అని తెలిస్తే ఉన్నది ఆత్మే. నాకు తెలుసున్నా, తెలియకపోయినా ఉన్నది ఆత్మే. అది తెలిస్తే సుఖం, తెలియకపోతే దుఃఖం. అంతర్యామిగా ఉన్న సద్వస్తువును ఎవడైతే అనుభవంలోనికి తెచ్చుకొంటున్నాడో వాడిని మాత్రమే దుఃఖం విడిచిపెడుతుంది. ఆ వస్తువు గురించి మీకు తెలియదు అనుకోండి, వెయ్యి కోట్ల డబ్బు ఉన్నా మిమ్మల్ని దుఃఖం విడిచిపెట్టదు. కొంతమందికి దేహానికి సంబంధించిన భోగాలు అంటే చాలా ఇష్టం, దేహం తప్పించి వాళ్లకు ఏమీ అక్కరలేదు, ఇలా దేహానికి సంబంధించిన భోగాలు, లోకానికి సంబంధించిన భోగాలు అనుభవిస్తూ ఉంటే చివరకు రోగాలు మిగులుతాయి. భగవంతుడి స్మరణ, భగవంతుడికి సంబంధించిన వైభవం కనుక అనుభవిస్తూ ఉంటే జ్ఞాని అవుతాడు, ఆ శరీరానికి తేజస్సు వస్తుంది, అందుచేతనే జ్ఞానులను చూసే కొలది చూడాలనిపిస్తుంది. అలా గౌతమబుద్ధుడిని దర్శించి, సాధన లేకుండానే అనేకమంది జ్ఞానులు అయ్యారు. మనం జాగ్రదవస్థ నిజం అనుకొంటాము, స్వప్నావస్థ, సుషిప్తి అవస్థ అసత్యం అనుకొంటాము కాని జ్ఞానికి ఈ మూడు అవస్థలు కూడా అసత్యంగానే గోచరిస్తాయి.

దూది ఎంత పెద్ద గుట్టగా ఉన్నా ఫరవాలేదు, నువ్వు ఒక్క అగ్గిపుల్లగీచి ఆదూదిమీద పడవేస్తే మొత్తం అంతా అంటుకుపోతుంది. అలాగే నీ బుద్ధిలో ఎన్ని దోషాలు ఉన్నా ఫరవాలేదు, నువ్వు గోవిందనామం చేసుకొంటూఉంటే నీ బుద్ధిలో ఉన్న దోషాలు అన్నీ కాలిబూడిద అవుతాయి, వాడే నారాయణుడు, వాడే కృష్ణుడు అని భీష్ముడు చెపుతాడు. తలకాయ ఉన్న వాడికి తలకాయ పోటు వస్తుంది, తలకాయ లేనివాడికి కూడా తలకాయ పోటు వచ్చినట్లుగా ఉంది అంటే ఈ ప్రపంచం నిజంగా లేదు కాని ఈ ప్రపంచం ఉందని నీ మనస్సు చెపుతోంది, ఆ మనస్సే నేను అని నీవు అనుకొంటున్నావు అందుచేత బాధలన్నీ భరించవలసివస్తోంది. పెద్దలు చెప్పిన మాటలను, శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించటం మనం నేర్చుకోవాలి. మనం సకామకర్మలు చేస్తున్నాము, నిష్కామకర్మలు చేయటం లేదు. నిష్కామకర్మ చేయకుండా మనకు చిత్తశుద్ధి కలుగదు. చిత్తశుద్ధి లేకపోతే ఆధ్యాత్మికంగానే కాదు బౌతికంగా కూడా

నీవు అభివృద్ధిని పొందలేవు. వివేకానందుడు వారు మొదట కొంత కాలం ఇంటికి అద్దె కూడా కట్టలేక పోయేవారు, అప్పుడు తెలిసినవారు ఎవరైనా అద్దె కట్టేవారు కాని ఇవాళ రోజున రామకృష్ణ మిషన్ చాలా పెద్దది అయిపోయింది. ఇంత మహావృక్షం ఎలా అయ్యింది అంటే వారు చేసేపని చిత్తశుద్ధితో చేసారు, వారి మనస్సులో దోషం లేదు, నిండుమనస్సుతో హృదయ పూర్వకంగా చేసారు. చిత్తశుద్ధి లేనప్పుడు గొప్పలకోసం పనులు చేయటం వలన మనకు ఆడంబరాలు, రోగాలు మిగులుతాయి అంటే దేహానికి రోగాలు, మనస్సులో అశాంతి, చివరకు మనం సాధించేది అది. ఒక మాట గుర్తు పెట్టుకోండి. నిష్ప్రపంచస్థితిని పొందినవాడికి కాని బ్రహ్మజ్ఞానం కలుగదు. ఈప్రపంచంలో ఉండగానే ప్రపంచం లేనిస్థితిని పొందాలి అంటే ప్రకృతిని దాటాలి. తేలిక వస్తువులు నీటిలో మునగవు, బరువైన వస్తువులు నీటిలో మునుగుతాయి. అలాగే తేలిక మనుషులు లోపలకు దిగలేరు, తూకం ఉన్నవారు మాత్రమే లోపలకు దిగుతారు. ఆరు సంవత్సరాల క్రితం ఎవరికైనా మజ్జిగ పోస్తే ఆ మజ్జిగ కూడా కొంతమంది జ్ఞాపకం పెట్టుకొంటారు, ఇంక వారికి జ్ఞానం ఏమిటి? భగవాన్ ఏమన్నారు అంటే పక్షి ఎంతో దూరం ఎగురుతుంది, చాలాబాగా ఎగురుతోంది అని మనం అనుకొంటాము. అలా తిరిగి తిరిగి తన గూటిలోనికి తాను వస్తుంది, దాని గూటిలోనికి అది వస్తేనేగాని దానికి శాంతి లేదు అలాగే మనం ఎన్ని జన్మలు ఎత్తినా, ఎన్ని బాధలు పడినా మన నిజమైన ఇల్లు అయిన హృదయంలోనికి చేరుకొనేవరకు, హృదయగుహలోనికి ప్రవేశించేవరకు మనకు శాంతి లేదు, మోక్షం లేదు. నువ్వు ఎక్కడ నుండి అయితే వచ్చావో అక్కడికి వెళితేనేగాని నీకు విశ్రాంతి లేదు, శాంతి లేదు. మనం హృదయంలో నుండి వచ్చాము అందుచేత తిరిగి అక్కడకు చేరుకొనే వరకు మనకు శాంతి లేదు, మోక్షం లేదు. నువ్వు సత్పురుషుడు దగ్గరికి వెళితే సత్యవస్తువును తీసుకొనే విధానం చెపుతాడు అందుకే సత్పురుషుల సహవాసం.

మీటింగులకు వచ్చే జనం కూడా ఎలా ఉన్నారు అంటే ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే అంటే దుష్టులను శిక్షించటానికి, ధర్మాన్ని స్థాపించటానికి నేను అవతరిస్తూ ఉంటాను అని గీతలో పరమాత్మ చెప్పాడు అని నేను చెప్పాను అనుకోండి. నాన్నగారు మా గురించే చెబుతున్నారేమో అనుకొనేవారు కూడా ఉన్నారు. నేను చెప్పేది మీ గురించి చెప్పటం లేదు, మీకు శాస్త్రం ప్రమాణం. సబ్జక్టు మీరు ఉన్నది ఉన్నట్లుగా అర్థం చేసుకోవాలి కాని పెడఅర్థాలు తీసుకోకూడదు. అది ఎంతవరకు తీసుకోవాలో అంత వరకు తీసుకోవాలి దానికి యుక్తి అవసరం, సత్యాన్వేషణలో యుక్తి అవసరం. ఇదిగో నాన్నగారు ఈ మాట చెపుతున్నారు

ఇది ఎంత వరకు మనకు ఉపయోగపడుతుంది అని మీరు చూసుకోవాలి. నాన్నగారు ఈ విషయం ఎందుకు చెప్పారు, ఈ మాట ఎందుకు చెప్పారు అని మీలో యుక్తిని ఉపయోగించి నేను చెప్పిన మాటలలో మీకు ఉపయోగపడే మాటలను తీసుకోవాలి. నాన్నగారు చెప్పే మాటకు ప్రమాణం ఏమయినా ఉందా? ఈ మాటలు మనలను చీకటిలోనికి తీసుకొని వెళుతున్నాయా లేక వెలుగులోనికి తీసుకొని వెళుతున్నాయా, ఈ మాటలు మనకు సత్యాన్వేషణకు ఉపయోగపడుతున్నాయా అని మీలో మీరు తర్కించుకోవాలి, దానికి యుక్తి అవసరం. తెర సత్యం, దాని మీద కనిపించే బొమ్మలు అన్నీ అసత్యం. చైతన్యం ఒక్కటే సత్యం మిగతావి అన్నీ అందులో కల్పించబడ్డాయి. ఈ ప్రపంచం అనేది ఒక స్టేజి. మనం పుట్టకముందు అనేక రూపాలు వచ్చాయి, వెళ్లిపోయాయి. ఇప్పుడు మనం వచ్చాము కొంతకాలం యాక్ట్ చేస్తాము వెళ్ళిపోతాము, మనం వెళ్ళిపోతే ఈ ప్రపంచం ఆగిపోదు మరల ఈ ప్రపంచంలోనికి కొత్త రూపాలు వస్తాయి, వాళ్ళు యాక్ట్ చేస్తారు. ఆత్మ అనే తెరమీద ఈ నామరూపాలు వస్తూ ఉంటాయి, వెళ్ళిపోతూ ఉంటాయి. ఈ నామరూపాలు నిజం కాదు. నామ రూపాలకు ఆధారంగా ఉన్న తెరమాత్రం నిజం. సూక్ష్మరూపంలో అన్నింటికి ఆధారంగా ఉన్న ఆత్మ ఒక్కటే నిజం, మిగతావి అన్నీ అసత్యం. ఎప్పుడూ ఉండేది నిన్ను సుఖ పెడుతుంది కాని ఉన్నట్లుగా కనిపించేది నిన్ను సుఖపెట్టలేదు.

స్నేహాలు కూడా తగు మాత్రంగా ఉండాలి అని పరమాత్మ చెప్పాడు. ఎందుచేతనంటే మీరు అతిగా స్నేహం చేస్తారు అనుకోండి, వారు ఎప్పుడయినా విరోధులు అయితే మీకు అశాంతి వచ్చేస్తోంది, దుఃఖం వచ్చేస్తోంది. మనం మాట దగ్గర యుక్తంగా ఉండాలి, తిండి దగ్గర యుక్తంగా ఉండాలి, స్నేహం దగ్గర యుక్తంగా ఉండాలి, అతి పనికిరాదు. నరకంలో ఎన్ని బాధలు ఉన్నాయో కలియుగంలో కూడా అన్ని బాధలు ఉన్నాయి, ఈ బాధలలో నుండి విడుదల పొందాలంటే గోవిందుడిని స్మరించుకో, నారాయణుడిని స్మరించుకో అంటున్నారు. నారాయణ స్మరణ లేకుండా నీవు మోహంలో నుండి బయటకు రాలేవు. మోహంలో నుండి బయటకు రాకుండా నీవు మోక్షాన్ని ఎలా పొందగలవు. చేతులతో శివుని పూజించుకో, నోటి నిండా హరిని స్మరించుకో ఈ కలియుగంలో ఉన్న బాధల నుండి బయటపడతావు. మీకు కలలు వస్తాయా అని ఒకసారి భగవాన్‌ను అడిగారు, వస్తాయి కాని అది స్వప్నం అని తెలుస్తూ ఉంటుంది అని చెప్పారు. అదీ ఆయనకు, మనకు ఉన్న తేడా. మనకు స్వప్నం జరుగుతున్నంత సేపు స్వప్నం నిజం అనిపిస్తుంది, మెలకువ వచ్చాక అది స్వప్నం అని మనకు

తెలుస్తుంది. జ్ఞానికి ఒక్క స్వప్నం మాత్రమే కాదు, మూడు అవస్థలు కూడా స్వప్న సమానమే. అందుచేత వాడు ఇంక మోహంలో పడే అవకాశం లేదు. వాడు ఎలాగ ఉన్నాడో అలాగ ఉంటాడు అంతే. దేహము నేను అనుకొన్నప్పడు లోపల బయట, మనస్సు నేను అనుకొన్నప్పడు లోపల బయట, తనువు తానుకాదని తెలిసినవాడికి లోపల బయట ఎక్కడ ఉంది. రోగం ఉన్నవాడికి మందు కావాలి, రోగం లేనివాడికి మందు ఎందుకు? అలాగే తనువు తాను కాదని తెలిసినవాడికి ఈ జపమేల, తపమేల అంటున్నాడు త్యాగరాజు. మిధ్యానేను నుండి బయటకు రావటానికే జపాలు, తపాలు, ఈ సాధనలు అన్నీ. ఈ శవం నువ్వు కాదని నీకు అర్ధమయినప్పడు ఈ సాధనలతో నీకు పని ఏముంది, దానిలో నుండి విడుదల పొందుతావు, పొందవలసింది ఏదో పొందుతావు. ఇక్కడ భగవాన్ ఎంత అందంగా చెపుతున్నారో చూడండి నీ దేహము, మనస్సు, కోరికలు ఇప్పడు నీకు ఎలా అనుభవంలో ఉన్నాయో అలాగ జ్ఞానికి తనలో ఉన్న సత్యం అంత డైరెక్టుగా అనుభవంలో ఉంటుంది అని చెప్పారు. మీలో ఎవరినయినా మీ శరీరం ఏమీ బాగాలేదు, మీరు నల్లగా ఉన్నారు అంటే మీరు భరించలేరు, వెంటనే దుఃఖం వచ్చేస్తుంది. ఎందుచేత ఆ శరీరం మీదే అనుకొంటున్నారు, ఆ అనుభవం మీకు ఉంది కాని ఆ శరీరం మీరు కాదని మీకు తెలిసినప్పడు ఆ మాట యొక్క ప్రభావం మీమీద ఉండదు. అలాగే ఇక్కడ అందమైన శరీరాలు ఉంటే, మీ శరీరం చాలా అందంగా ఉంది అని పొగిడినా ఆ శరీరం తానుకాదని తెలిసినవాడికి ఆ పొగడ్త యొక్క ప్రభావం వాడి మీద పడదు.

భగవంతుడి యొక్క గుణ గానమే విష్ణుసహస్రనామాలు. ఆ గుణాలను మనం ఆస్వాదిస్తూ ఉంటే మనం పవిత్రులం అవుతాము, పరిశుద్ధులమవుతాము, ఏకాగ్రత కలుగుతుంది, అంటే లోపల భగవంతుడికి సంబంధించిన ధ్యాస తప్పించి ఇంకో తలంపు రాదు. అటువంటి ఏకాగ్రత కుదిరినప్పడే మనకు మోక్షం వస్తుంది, అదే ప్రహ్లాదుడి యొక్క ఏకాగ్రత. భీష్ముడు ఏమి చెపుతున్నాడు అంటే మీ అమ్మను ప్రేమించు, నాన్నను ప్రేమించు, మీ తాతను ప్రేమించు కాని వీరందరూ బ్రహ్మమే అని ప్రేమించు. నీటిలో అనేక కెరటాలు ఉంటాయి కాని కెరటాలలో ఉన్నది నీరే, ఆ నీరును తీసివేస్తే కెరటం లేదు. మీ అత్తగారు ఒక కెరటం, మావగారు ఒక కెరటం, మీ ఆయన ఒక కెరటం, ఈ కెరటాలు అన్నీ ఎక్కడ నుండి వచ్చాయి నీటిలో నుండి వచ్చాయి. అలాగే వారు అందరూ బ్రహ్మంలో నుండే వచ్చారు. అందుచేత ఒకటి మర్చిపోవద్దు మీ ఇంట్లో వారిని ప్రేమించేటప్పడు కూడా వారందరూ బ్రహ్మమే అని ఆ బ్రాహ్మీదృష్టితో వారిని ప్రేమించండి. మీ ప్రేమను నామ, రూపాలకు పరిమితం చేయవద్దు.

మీ ప్రేమను నామరూపాలకు పరిమితం చేస్తే, మీకు బ్రహ్మభావన కనుక లేకపోతే మీకు మిగిలేది దుఃఖం, మీకు మిగిలేది అశాంతి. ఈ ప్రపంచం వేరు, పరమాత్మ వేరు అని ఇప్పడు మనం అనుకొంటున్నాము. మనలో ఉన్న కోరికలు, మనలో ఉన్న వాసనలు, మనలో ఉన్న స్వార్థం పూర్తిగా విడిచిపెట్టేసి, వాటిని ఒక ప్రక్కన పడవేస్తే అప్పడు మీకు లోకం అంతా పరమాత్మగానే కనిపిస్తుంది, బేధబుద్ధి నశిస్తుంది. మీలో ఉన్న వ్యక్తిభావనను పూర్తిగా తొలగిస్తే ఈ సృష్టి అంతా కూడా పరమాత్మగానే గోచరిస్తుంది. కృష్ణుడు యుద్ధాలు చేసాడు వాడు పరమాత్మ ఏమిటి అని అంటారు. మీకు సబ్జక్టు అర్థం కావటం లేదు. ఒక మంచికోసం హింసచేసినా అది అహింసతో సమానము, అక్కడ సంకల్పము ముఖ్యం, చిత్తశుద్ధి ముఖ్యం. ఆ పని ఎందుకు చేస్తున్నాడో అది గ్రహించి మనం మాట్లాడాలి. మనకు అసలు లోచూపు లేదు, ఇంక లోపల ఉన్నది ఏమి కనిపిస్తుంది.

జ్ఞానికి శరీరం ఉంటుంది, అజ్ఞానికి శరీరం ఉంటుంది. అజ్ఞాని శరీరానికి పరిమితమై ఉంటాడు. జ్ఞానికి శరీరం ఉంటుంది కాని ఆ శరీరం తాను కాదని ఆయనకు తెలుస్తూ ఉంటుంది. భగవంతుడిని ఆరాధించగా ఆరాధించగా నీ భక్తి నిజమయితే, నీ జిజ్ఞాస నిజమయితే నీ ఒక్కడికోసం ఆయన శరీరం ధరించివచ్చి నీకు భోదిస్తాడు అని భగవాన్ చెప్పారు. ఆ బోధించినప్పడు కూడా నువ్వు శరీరానికి పరిమితం కాబట్టి వాడు కూడా ఆ శరీరానికి పరిమితం అనుకొంటావు. అవతార పురుషుడు శరీరం ధరించినప్పడు ఎలాగ ఉంటుంది అంటే ఒక పెద్ద ఏనుగును ఒక చిన్న గుడిసెలోనికి తోలితే దాని పరిస్థితి ఎలాగ ఉంటుందో మహాజ్ఞాని శరీరం ధరించినప్పడు కూడా అలాగే ఉంటుంది. ఆయన మన కోసం శరీరం ధరించి, మనకు దేహాత్మబుద్ధి ఉంది కాబట్టి మన కూడా ఉంటూ, మనతో కలిసి మాట్లాడుతూ, తిరుగుతూ ఆ దేహాత్మబుద్ధిలో నుండి మనలను విడుదల చేస్తాడు, వాడు జ్ఞాని. పరమాత్మ శక్తి గురించి మనకు తెలియదు, మన భావనకు ఆయన అందడు. మనకు ఎంతశక్తి ఉందో ఆయనకీ అంతే అని అనుకొంటాము. ఈ లోకంలో చాలామంది మాయలు చేసేవారు ఉన్నారు. ఈ మాయలు చేసేవారిని కూడా మాయ చేసేవాడు ఒకడు ఉన్నాడు, ఆయనే పరమాత్మ అని భీష్ముడు చెప్పాడు. మనం ఎంత ప్రయత్నం చేసినా, ఎంత సాధన చేసినా ఆయన దయ లేకుండా మనం మాయలో నుండి విడుదల పొందలేము. ఈ దేహమే బ్రహ్మం, దేహమే సర్వస్వం అని మనం అనుకొంటున్నాము కదా, ఈ దేహభావన దాటినవాడు జ్ఞాని అవుతాడు. దేహబుద్ధి నశించిన వెంటనే శివబుద్ధి కలుగుతుంది. నేను మొన్న తిరుపతి

వెళ్ళినప్పుడు నా ప్రక్కన ఒక పండితుడు కూర్చొన్నారు. ఆయన వ్యాసాశ్రమంలో చదువుకొన్నారు. 1950వ సం॥లో భగవాన్ శరీరం విడిచిపెట్టినప్పుడు ఆ వార్తను తీసుకొని వెళ్ళి మళయాళస్వామికి చెప్పారట, మీటింగుపెట్టి ఆయన శాంతికోసం ప్రార్థిద్దాము అన్నారట. అప్పుడు మళయాళ స్వాముల వారు అన్నారట ఎవడి పేరు తలపెట్టుకొంటూ ఉంటే మనకు శాంతి వస్తోందో వాడికి శాంతి కలగటం కోసం మనం ప్రార్థించటం ఏమిటిరా అన్నారట. ఆయన శాంతి లేకుండా ఉన్నాడా? జ్ఞానికి దేహం ఉన్నా లేకపోయినా వాడికి భేదం తెలియదు. ఆయన శాంతి కోసం మనం ప్రార్థన చేయనక్కరలేదు. అయితే నువ్వు చెప్పినట్లుగా సభ మటుకు పెడదాము. ఆ సభలో నువ్వు మాట్లాడు, ఎలా మాట్లాడతావు అంటే ఇటువంటి ఋషులు, ఆచార్యులు, బ్రహ్మనిష్ట కలవారు భవిష్యత్తులో చాలామంది వచ్చుగాక అని ఈశ్వరుని ప్రార్థిస్తూ తీర్మానం చేద్దాము అని స్వాములు వారు చెప్పారట.

జ్ఞాని ఏమీ అనుకోడు, వాడి ద్వారా ఈశ్వరుడే పనిచేస్తూ ఉంటాడు. జ్ఞాని నోరును ఈశ్వరుడు ఉపయోగించుకొంటాడు. రమణవాక్కు ఈశ్వరవాక్కు. శ్రుతి అంటే వేదం, శ్రుతికి మనం ఎటువంటి ప్రమాణం ఇస్తున్నామో జ్ఞాని చెప్పిన మాటను కూడా అంత ప్రమాణంగా తీసుకోవచ్చు. ఎందుచేతనంటే ద్వంద్వరహితుడు చెప్పినమాట శ్రుతికి సరిపోతుంది కాని ద్వంద్వభావనతో చెప్పినమాట శ్రుతికి సరిపోదు. జ్ఞాని ప్రేమించాలి అని ఎవరినీ ప్రేమించడు, ప్రేమించకుండా ఉండలేడు కాబట్టి ప్రేమిస్తాడు, అంతా తానే. ఒకసారి భగవాన్‌తో ఎవరో మాట్లాడుతూ ఈ ఊరిలోని వారు ఎవరో మిమ్మల్ని తిడుతున్నారండీ, ఒక లెంపకాయ కొడదామనుకొన్నాను కాని కొట్టకుండా వచ్చేసాను అని చెప్పాడు. భగవాన్ ఏమన్నారు అంటే మన పళ్ళు కూడా ఒకోసారి మన నాలుకను కరుస్తాయి అయితే పళ్ళు ఊడదీసుకుంటామా? పళ్ళు మనవే, నాలుక మనదే రెండూ మనవే కాబట్టి పళ్ళు ఊడగొట్టుకోము. అలాగే వాడేదో అన్నాడు అంటున్నావు. వాడు ఎవడు, ఉన్నది ఒక్కటే. నువ్వు లెంపకాయ కొట్టకుండా రావటం మంచిపనే చేసావు అన్నారు, నువ్వు సహనం నేర్చుకో సరిపోతుంది అని చెప్పారు. మీది నోరా లేక పుట్టా అన్నాడు భీష్ముడు. నోటిలో నాలుక ఉంటుంది, పుట్టలో పాములు ఉంటాయి. నారాయణ స్మరణ కనుక లేకపోతే మీ నాలుక కూడా పాముతో సమానము. మీది నోరా లేక ఏమయినా పుట్టా అని ఇంటికి వెళ్ళిన తరువాత చూసుకోండి. మీ చేతులతో శివుని పూజించండి, మీ నోటి నిండా భగవంతుడిని స్మరించండి, మీరు పొందవలసింది పొందుతారు, మీరు తరిస్తారు.

**జూన్ నెలలో సద్గురు శ్రీ నాన్నగారు ప్రవచనాలు ప్రారంభమవుతాయి. తేదీలు తరువాత తెలియపర్చబడును.**

# లోకం దుఃఖమయం - జీవితం వ్యథామయం ఆత్మ ఆనంద మయం

పంచభూత నిర్మితమైన ఈ లోకాన్ని యదాతదంగా చూస్తే నిజానికి ఎటువంటి విలువ లేదు, కాని మన ఇష్టా అయిష్టాలే వాటికి ఆపాదింపజేసుకొని వాటికి లేని విలువలు వాటికి ఆపాదింపజేసుకొంటున్నాయి. ఈ లోకం మార్పు చెందేది - నశించేది కాదు. దుర్మార్గమైనది. ఈ లోకం, ఈ జీవితం కాలుని "ఉచ్చు". అహంకారం ఉన్నచోట ఆపదలు, సంపదలు ఉన్న చోట శోకాలు ఉంటాయి. మనం ఇతరుల తప్పులను చూచి నవ్వుకొంటాము, మొదలు, చివరా లేని మన అహంకారమనే పెద్ద తప్పను చూచి మనం నవ్వుకొన్నప్పడే నిజమైన సాధకులమౌతాము. మయసభలో దుర్యోధనుని నడవడికను చూచి నవ్విన ద్రౌపతి నిండు సభలో నవ్వులపాలైనది. దయ ఉన్నచోట ధర్మం - లోభం ఉన్నచోట పాపము - క్రోధము ఉన్నచోట మృత్యువు - క్షమ ఉన్నచోట భగవంతుడు ఉంటాడు. మనకు సత్య దర్శనం కలగాలంటే జీవితం పొడుగునా క్షమాగుణాన్ని అంటిపెట్టుకొని ఉండాలి. లక్ష్మణుణ్ణి తిట్టి సీత కష్టాలు కొనితెచ్చుకొంది, కర్మగతి మార్పురానిది. వశిష్టులవంటి మహాపురుషులు శోధించి, లగ్నము పెట్టారు కాని సీత అపహరించబడింది, హరిశ్చంద్రుడు నీచుని చేతిలో అమ్ముడుపోయాడు. బలిచక్రవర్తి పాతాళానికి పోయాడు. కృష్ణుని అండ ఉన్నా పాండవులకు కష్టాలు తప్పలేదు. కోటి యుగాలు గడిచినా కర్మ లిఖితం మాసిపోదు, చిరిగి పోదు. ఎత్తైన మేడల్లో ఉన్నామని గర్వం తెచ్చుకొంటే రేపే బోర్లాపడతాము. తరువాత మన బూడిద మీదే గడ్డి మొలుస్తుంది. ఈ లోకాన్ని, ఈ జీవితాన్ని నిజమని నమ్ముకొంటే, పగలు-రాత్రే కాదు, కలలో కూడా సుఖం ఉండదు. "నేను-నేను" అనే మాట ఆపద అని, "నీవు-నీది" అనేమాట క్షేమమని గుర్తించుకోవాలి. గురువును ఒక్క క్షణం కూడా స్మరించుకొనే తీరికలేదని, రేపు స్మరించుకొందాము అని అనుకొంటే, తీతువు పిట్టను గెద్ద తన్నుకుపోయినట్లు కాలము మనలను ఉన్నట్లుండి చంపుతుంది. తరువాత చీకటే గతి. కోటి చంద్రులు, కోటి సూర్యులు ఉదయించినా, సద్గురువు లేకున్న అంతా కటిక చీకటే. జపమాల త్రిప్పచుండగనే యుగాలు గడిచాయి. మనస్సు తిరగటం మానలేదు, మాలను ప్రక్కన పెట్టి మనస్సు పూసలను త్రిప్పటం అలవాటు చేసుకో అన్నారు కబీర్. అది మనవల్ల కాకపోతే గురువుని శరణువేడి "లక్షలాది సంస్కారాలు నాకు అడ్డుగా ఉన్నా నా చెయ్యి విడువకు, నా వంటి వారు నీకు అనేకం, నీ వంటి వారు నాకు ఎవ్వరు ఉన్నారు" అని దీనంగా ప్రార్థన చేస్తే, ఈ కర్మ చక్రం నుంచి బయటపడేసి, ఆనందమయులను చేస్తారు గురువు.

సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం



దిll 20-03-05న
పాలకొల్లు త్యాగరాయ
నారాయణదాసుగార్ల
గానసభ ఆధ్వర్యంలో
పాలకొల్లు మాజీ శాసన
సభ్యులు శ్రీ అల్లు వెంకట
సత్యనారాయణగార్ని
సన్మానించిన
సద్గురు శ్రీ నాన్నగారు

ప్రభూ!

నీ సన్నిధి శాశ్వత మనుకుని
నీ ఒడిలో మైమరచి నిద్రిస్తున్న నన్ను
మాయ చేసి, ఈ లోకంలో పడవేశావ్!
మమతల బంధాల్లో ఇరికించావ్!
ఎలా నిన్ను మరుస్తాననుకున్నావ్?
నాలో అణువణువూ నిన్నే పలవరిస్తోంది!
నాకు తెలుసు, నువ్వు దాక్కున్నావ్
నాకన్ను కప్పి, నా మనస్సు పరదా మాటున!
నిన్ను నేను కనుక్కోలేననీ,
నీదరికి నే చేరలేననీ నీ యూహ!
చూడు, చూడు, నా 'ఏకాగ్రత' అనే ఖడ్గంతో
చీలుస్తున్నాను, నా మనోయవనికను!
తెరతొలిగి, నువ్వు నా ఎదుట ప్రత్యక్షం!
మరి పోనిస్తానా నిన్ను, ఇక రానిస్తానా మాయని?

- ఆర్.ఎ. నాయక్, విశాఖపట్నం